సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 7 । నవంబర్ । 2023



ప్రతి రైతును ఆదుకుంటాం

వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి హామీ ఇచ్చారు. - IIతో



మద్యం దుకాణాలపై నిఘా

జిల్లాలో 124 ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. - IIతో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.5 /24.4

జిల్లాలో సోమవారం 24.4 - 33.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

15 లోపు ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పరీక్షల ప్రశ్నపత్రాలకు చెల్లించవలసిన ఫీజును ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సెక్రెటరీ, డీసీఈబీ..కడప పేరనున్న అకౌంట్ నంబర్ 10844908188కు చెల్లించి రసీదును పొందాలన్నారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో నాలుగు రోజులుగా అక్కడక్కడ వర్షం కురుస్తోంది. రాజుపాలెంలో 42.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మైలవరం మండలంలో 26.4, కొండాపురం మండలంలో 22.4, జమ్మలమడుగులో 12.2, లింగాలలో 5.2, సింహాద్రిపురంలో 1.6, బిమఠంలో 17.8, అట్లూరులో 12.2, కాశినాయనలో 10.2, పోరుమామిళ్లలో 5.2, గోపవరంలో 4.6, కలసపాడులో 4.2, బద్వేల్‌లో 2.2, వల్లూరులో 8.6, చెన్నూరులో 6.8, ఖాజీపేటలో 1.6, కడపలో 1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమన్వయకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని 35 మండలాలు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న 128 గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జేసీ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న నోటిఫికేషన్ ఇస్తామన్నారు. 13, 14 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 15న సమాచార లేఖలు పంపుతామన్నారు. 16న శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఏఎస్ఐ డిస్మిస్

కడప అర్బన్ : కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న బి.ఉత్తమారెడ్డి (ఏఎస్ఐ 1106)ని సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసిన ఉత్తమారెడ్డిపై వచ్చిన వివిధ ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు చదరంగం ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీ ఉదయం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి చదరంగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించే ఈ ఎంపికలకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు హాజరకావచ్చన్నారు.

14న సైన్స్ కాంగ్రెస్ పోటీలు

కడప ఎడ్యుకేషన్ : జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లాస్థాయి పోటీలను 14వ తేదీన కడప మునిసిపల్ స్కూల్(మెయిన్)లో నిర్వహిస్తామని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. వివరాలకు 8790564408, 9492378327 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : పెండింగ్ గృహాలను త్వరగా పూర్తి చేయాలని జేసీ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ×వై ఏపీ నీడ్స్ జగన్, హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జగనన్న హౌసింగ్ లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సురక్ష క్యాంపుల్లో కంటి వెలుగు కింద నమోదైన 5035 కేసులు, జనరల్ రెఫరల్ కింద నమోదైన 1916 కేసులు డిసెంబరు లోపు పూర్తి చేయాలన్నారు.

అరుణాచలానికి బస్సులు

మైదుకూరు : కార్తీక మాసం సందర్భంగా అరుణాచలానికి మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 13 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు తిప్పుతామని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9885448199 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నైపుణ్య కళాశాల ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర గ్రామీణ వికాసాభివృద్ధి శాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో భారత్ ఎడ్యుకేషనల్ సొసైటీ(గోల్డెన్ వ్యాలీ గ్రూప్) నిర్వహణలో కడప టీటీడీసీలో రాష్ట్ర స్కిల్ కాలేజీ సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కళాశాల వల్ల యువతకు ఉద్యోగావకాశాలులభిస్తాయన్నారు. ఈ సందర్భంగా గోల్డెన్ వ్యాలీ చైర్మన్ ఎన్వీ రమణారెడ్డిని అభినందించారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పి. సుబ్బారెడ్డి, కడప జిల్లా స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగయ్య, అపుస్మా రాష్ట్ర సలహాదారు వెంకటరామరెడ్డి పాల్గొన్నారు.

సేవా సైన్యం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత అలవర్చేలా విద్యార్థిదశ నుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సేవాసంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'.. గతేడాది యూనిట్ల ఏర్పాటులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 211 యూనిట్ల నుంచి 5176 మంది కేడెట్స్ శిక్షణ పొందుతూ సమాజ సేవలందిస్తున్నారు. నవంబర్ 7న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని కథనం.

- వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 211 స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు
- 5176 మంది బాలబాలికలకు శిక్షణ
- నేడు 74వ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం



జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలం సురేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న స్కౌట్స్ అండ్‌గైడ్స్ (ఫైల్)

కడప స్పోర్ట్స్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ (బీజీఎస్) దేశంలో 1907లో మేజర్ బెడెన్ పావెల్ చేతుల మీదుగా ప్రారంభం కాగా, కడప జిల్లాలో 1930లో ప్రారంభమైంది. అనంతరం రెండుగా ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్లు 1950లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా రూపాంతరం చెందింది. అప్పట్లో కడప నగరానికి చెందిన దాత రావుబహదూర్ వెంకటశేషం శెట్టి 2.25 ఎకరాల స్థలాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఉచితంగా అందజేశారు. దీంతో 1937లో అప్పటి కలెక్టర్ హెజ్‌మాడీ ప్రస్తుతం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్న భవనాన్ని నిర్మించాడు. జిల్లాలో గత కొద్ది సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అనూహ్య స్పందన వస్తుండటంతో స్కౌట్స్ ప్రాధాన్యం పెరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలోనూ స్కౌట్ శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 73 మంది స్కౌట్‌మాస్టర్‌లు, 29 మంది గైడ్‌లుగా వ్యవహరిస్తూ శిక్షణ అందిస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో 209 యూనిట్లు ఏర్పాటుచేసి రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలవడం విశేషం.

శిక్షణ ఇలా..

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ మొత్తం ఆరుదశల్లో ఉంటుంది. ఇందులో భాగంగా ప్రవేశ్, ప్రథమసోపాన్, ద్వితీయ సోపాన్, తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్, రాష్ట్రపతి అవార్డు ఎంపిక వరకు విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రతిభచాటుకునే అవకాశం ఉంటుంది. స్కౌట్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా విద్యార్థుల్లో ఉత్సాహం లభిస్తుంది. సమాజంపై అవగాహన ఏర్పడుతుంది. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవడతాయి.8 అంశాల స్కౌట్స్ నియమాలు విద్యార్థులను పరిపూర్ణవంతులుగా మలిచేందుకు ఉపయోగపడుతుంది.

బీఎస్‌జీలో నేర్పే అంశాలు..

- నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- జట్టుకృషిని,సహకారాన్ని ప్రోత్సహించడం.
- ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం.
- శారీరక దృఢత్వం,బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం.
- జీవననైపుణ్యాలను నేర్చుకోవడం.
- సమాజ సేవాభావాన్ని పెంపొందించడం.
- సాంస్కృతిక అవగాహనను అభివృద్ధి చేయడం.
- వ్యక్తిగత వృద్ధికి అవకాశాలను అందించడం.
- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్య, ఉద్యోగరంగాల్లో రిజర్వేషన్లు కల్పించాయి. కేంద్ర ప్రభుత్వం రైల్వే, పోస్టల్ విభాగాల్లో ప్రత్యేక ఖాళీలు కేటాయిస్తారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రకాల పోటీ పరీక్షల్లో 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు, కేడెట్స్ వివరాలు..

యూనిట్లు	సంఖ్య	బాలబాలికలు
వైఎస్ఆర్ కడప జిల్లా		
కబ్ యూనిట్లు	02	24 మంది బాలురు
బుల్ బుల్ యూనిట్	01	12 మంది బాలికలు
స్కౌట్ యూనిట్స్	82	1963 మంది బాలురు
గైడ్ యూనిట్స్	53	1533 మంది బాలికలు
రోవర్ యూనిట్స్	12	216 మంది బాలురు
రేంజర్ యూనిట్స్	04	60 మంది బాలికలు
అన్నమయ్య జిల్లా		
స్కౌట్ యూనిట్స్	30	751 మంది బాలురు
గైడ్ యూనిట్స్	19	458 మంది బాలికలు
రోవర్ యూనిట్స్	05	90 మంది బాలురు
రేంజర్ యూనిట్స్	03	45 మంది బాలికలు

7 నుంచి 14 వరకు ప్రత్యేక కార్యక్రమాలు..

- నవంబర్ 7 నుంచి 14వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలునిర్వహించనున్నారు.అవగాహన ర్యాలీలు, క్యాంప్‌ఫైర్, కార్యక్రమాలను రోజుకొకటి చొప్పున నిర్వహించేలా పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.
- కడప నగరంలో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌కు ప్రాంతీయ కార్యాలయంగా సేవలందిస్తోంది.
- అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె దక్షిణభారత దేశ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలకు ప్రాంతీయ కేంద్రంగా సేవలందిస్తోంది.

నేటి నుంచి వారోత్సవాలు



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరే విద్యార్థులకు ప్రధానంగా 8 రకాల అంశాలపై శిక్షణ ఇస్తారు. విద్యార్థి అన్ని రంగాల్లో రాణించేలా ఆత్మస్థైర్యం పెంపొందేలా శిక్షణ ఉంటుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహిస్తాం .ఇందులో భాగంగా ఫ్లాగ్ డే స్టిక్కర్స్ పంపిణీ చేయడం, బెడెన్ పావెల్ జీవిత చరిత్రపై పెయింటింగ్ పోటీలుజరుపుతాం. వారంలో ఒక పీరియడ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేటాయించాలి.

- మడితాటి నరసింహారెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి,ఉమ్మడి వైఎస్సార్ జిల్లా

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోనాల గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. హెల్త్‌క్లినిక్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా వైద్య సౌకర్యాలు లభించడమే కాక సచివాలయం ద్వారా అన్ని సేవలు అందిస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలో వేల్పుల తర్వాత బోనాల సచివాలయ ప్రాంగణాలు బాగున్నాయని కితాబిచ్చారు. అనంతరం ప్రజలతో మమేకమై వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజల వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోనాల సర్పంచ్ అంకిరెడ్డి అనూరాధ, ఎంపీటీసీ కళ్యాణి అంకెవానిపల్లె సర్పంచ్ మమత, బోనాల వైఎస్సార్సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాము, మండల వైఎస్సార్సీపీ నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మినారాయణ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్తా రమేష్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్ర నాథ్ రెడ్డి. ఏఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్, పీఆర్‌ఏఈ మనోహర్ రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ శ్రీకాంత్, సీబీఆర్ ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలం..సంక్షేమ ఫలం





కడపలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు,రాజంపేటలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో సోమవారం సంబరాలు జరిగాయి. నాటి సంకల్ప బలం..నేడు ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు కురిపిస్తోందని ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

- కడపలోని హెడ్ పోస్టాఫీసు ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులు గజమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.



రాయచోటిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

- ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి రాజంపేటలోని తోట కళ్యాణ మండపంలో కేక్ కట్ చేశారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



రాయచోటిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని, అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్ అందాల్సి ఉందని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో ఎస్పీ సిద్ధార్థ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9, 10 తేదీల్లో పులివెందుల, ఇడుపులపాయలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉందన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా గట్టి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 9వ తేదిన రాయచోటికి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం పరిశీలించారు. సోమవారం రాయచోటిలోని చిత్తూరు, మదనపల్లి రింగ్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డీఎస్పీ మహబూబ్ బాషా, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కుమారుని వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పర్యటన ఏర్పాట్లను శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాజధాని కల్యాణ మండపం వెనుక భాగంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాల పనులను, హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపాలకు వెళ్లే రహదారుల మరమ్మతుల పనులపై ఆయన అధికారులతో చర్చించారు. అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కోరారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ విజయరామరాజు




అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంతోపాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'జయప్రదం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 9వ తేదీ నుంచి వారంపాటు నిర్వహించే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలో ప్రతి కుటుంబం ప్రభుత్వం ద్వారా పొందిన అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు.ఐదో దశలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రాధాన్యతతో నిర్వహించాలన్నారు. ఇప్పటికే హెల్త్ క్యాంపులు పూర్తయ్యాయన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారిని రెఫరల్ ఆస్పత్రుల్లో చేర్పించాలని చెప్పారు.

విద్యార్థులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులను అన్ని రకాలుగా రాణించే విధంగా గ్లోబల్‌గా తీర్చిదిద్దాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ మార్తల వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమశాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సోమవారం కడపలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడంతోపాటు చదుర్విధ పక్రియలను చేయగలిగేలా చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి ఎద్దుల రాఘవరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలు, కథల ద్వారా బోధన చేస్తే అవగాహన చేసుకుంటారన్నారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీలక్ష్మి మాట్లాడారు. ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఓ రామాంజనేయరెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా

- నేడు రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల
- జిల్లాలో 2,10,481 మందికి రూ. 85.94 కోట్లు లబ్ధి
- నేడు బద్వేల్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం

లబ్ధిదారుల వివరాలు..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	జమకానున్న నగదు (రూ.కోట్లలో)
బద్వేల్	37396	14.96
జమ్మలమడుగు	37399	15.42
కడప	1729	0.69
కమలాపురం	32742	13.33
మైదుకూరు	39527	16.45
ప్రొద్దుటూరు	11811	5.07
పులివెందుల	43325	17.39
ఒంటిమిట్ట	3100	1.24
సిద్దవటం	3452	1.38



మైదుకూరు ప్రాంతంలో సాగులో ఉన్న మినుము పంట



కడప అగ్రికల్చర్ : రాష్ట్రంలో రైతులకు జగనన్న ప్రభుత్వం ప్రతిసారి అండగా నిలుస్తోంది.ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినా వెంటనే ఆదుకుంటూ వస్తోంది.పంట పెట్టుబడులకు సంబంధించి కూడా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు రైతు భరోసా పథకం ద్వారా నిధులు విడుదల చేస్తోంది. తాజాగా రబీ సాగలో రెండో విడత కింద రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులను ప్రతి రైతుకు నాలుగు వేల రూపాయలు నగదును రైతు ఖాతాలకు జమచేయనుంది.. ఇందుకు సంబంధించి ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అన్నదాతల ఖాతాల్లో జమచేయనున్నారు. వైఎస్సార్‌జిల్లాకు సంబంధించిన జిల్లా స్థాయి సమావేశాన్ని బద్వేల్‌లోని బోజిరెడ్డి మెమోరియల్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, అన్ని నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు.

గడిచిన నాలుగేళ్లలో...

జిల్లాలో గడిచిన నాలుగేళ్లగా ప్రతి ఏటా రైతు భరోసా, పీఎం కిసాన్ రైతులకు అందజేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019-20 ఏడాదికి గాను 2,06,708 మందికి రూ. 279.93 కోట్లు రైతు ఖాతాలకు నగదును జమచేశారు. 2020-21లో 208747 మందికి రూ. 280.06 కోట్లు, 2021-22 ఏడాదికి 199344 మందికి రూ. 269.11 కోట్లు, 2022-23 ఏడాదికి 202598 మందికి 235.68 కోట్లు 2023-24లో మొదటి విడత కింద 205600 మందికి రూ. 154.87 కోట్లు, తాజాగా 2023-23 రెండోవిడత కింద 210481 మంది రైతులకు రూ. 85.94 కోట్లు జమచేయనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ సొమ్ములను విడుదల చేయనుంది. ఇందులో జిల్లాలోని 210481 మంది రైతులకు సంబంధించి రూ. 84.94 కోట్లు నగదు జమకానుంది. ఇందుకు సంబంధించిన జిల్లా కార్యక్రమం బద్వేల్‌లో జరగుతుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే ప్రస్తుత రబీ సీజన్‌కు సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేశాం.ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను కూడా సిద్ధంగా ఉంచాం.

- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

ప్రతి రైతును ఆదుకుంటాం



పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామం వద్ద పదును లేకపోవటంతో కోసిన జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎంవీఎస్ నాగిరెడ్డి



ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలో ఎండిపోయిన మినుము, కంది పంటలను పరిశీలిస్తున్న ఎంవీఎస్ నాగిరెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- వర్షాభావ పరిస్థితులతో నష్టపోయామని రైతుల ఆవేదన
- కరువు ప్రాంతంగా ప్రకటించాలని వినతి
- ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ హామీ

పెద్దముడియం : వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను, పంటలు సాగు చేయక బీడు భూములు పెట్టిన ప్రతి రైతును ఆదుకుంటామని వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డితో కలిసి మండలంలోని ఉలవపల్లె గ్రామంలో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వారితో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నా ప్రకృతి రైతులపై పగబట్టిందన్నారు. వర్షం లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, శనగ పంట సాగుకు కూడా తగినంత పదును లేకపోవడంతో పంటను సాగు చేయలేదని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమాని గండికోట జలాశయంలో పుష్కలంగా నీరు ఉండటంతో మైలవరం జలాశయం నుంచి వస్తున్న నీటిని కాలువల ద్వారా కొంత సాగుచేసిన పంటలకు నీటి తడులను అందిస్తున్నామని తెలిపారు. కాలువలు కూడా చాలా చోట్ల పూడిపోయాయని నీరు పారుదలకు కష్టంగా ఉందని తెలిపారు. మండలంలో యాభై వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉండగా కేవలం 5 వేల ఎకరాలకు కూడా నీటి తడులు అందించడం కష్టంగా ఉందన్నారు. తమ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఈ సంవత్సరం వర్షం తక్కువగా కురవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనన్నారు. రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రతి రైతును ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మెన్ పి.వి రమణారెడ్డి పాల్గొన్నారు.

మినుము, కంది పంటల పరిశీలన

ఎర్రగుంట్ల : ప్రస్తుతం సాగు చేసిన మినుము, కంది పంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయని వాటికి సంబంధించి రైతులను అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామ పరిధిలో సాగు చేసిన మినుము, కంది పంటలను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండుతున్న ఖరీఫ్, రబీ పంటల పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్లను కరువు మండలంగా గుర్తించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏపీ నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజుపాళెం వద్ద ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని రాజుపాళెం గ్రామ సమీపంలోని పెన్నానది వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. మండలంలోని బద్రిపల్లె గ్రామానికి చెందిన శంఖు వీరయ్య అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌లో పెన్నానది నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నండటంతో కేసు నమోదు చేసి మండల తహసీల్దార్‌కు ట్రాక్టర్‌ను అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

పోరుమామిళ్ల : పట్టణంలోని ముస్లిం వీధిలో ఆదివారం రాత్రి ఇండియా – దక్షిణాఫ్రికా క్రికెట్ ఆటపై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారి నుంచి రూ. 41,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. బెట్టింగులో ఉన్నవారంతా చదువుకున్నవారేనన్నారు. వారిలో ఉన్నత విద్య చదివిన వారు కూడా ఉన్నారని తెలిపారు. పిలిచినప్పుడు కోర్టులో హాజరు కావాలని చెప్పి స్టేషన్ బెయిల్ ఇచ్చామన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి
- 26 కుటుంబాలకు రూ.48.50లక్షల చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన తర్వాత లబ్ధిదారులతో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన 26 కుటుంబాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.48.50లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ రాష్ట్రమైనా, దేశమైనా బాగుంటుందన్నారు. ఒక వైద్యుడిగా పేద ప్రజల ఆరోగ్య ఇబ్బందులను గుర్తించిన దివంగత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, 104 ప్రవేశపెట్టి లక్షలాది మందికి ప్రాణదాతగా నిలిచారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో 3500లకు పైగా వ్యాధులను చేర్చడమేగాక, రూ.1000 దాటిన ప్రతి వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దేశంలో కనీ వినీ ఎరుగని విధంగా వైద్య, ఆరోగ్య శాఖలో 50వేల ఖాళీలను భర్తీ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని దీర్ఘకాలిక జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం చేసి ఆదుకుంటున్నారన్నారు. పేదల ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ కనబరుస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు తమ ఆశీస్సులు అందజేసి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతర నిఘా



ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో 124 ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని పలు షాపులను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన ధరలకు మద్యం అమ్ముతున్నారని, ఎక్కడా కూడా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్మడం లేదన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను నంద్యాల జిల్లా నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారన్నారు. ఎక్కడ కూడా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు సిబ్బంది అమ్మలేదని వారు తెలిపారన్నారు. జిల్లాలో ఆరుగురు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐలు, నలుగురు సీఐలతో నిత్యం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్న సిబ్బందిపై 15 కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగించామని స్పష్టం చేశారు.

మేడపై నుంచి దూకిన విద్యార్థిని

- పరిస్థితి విషమం
- కడప రిమ్స్‌కు తరలింపు



రెడ్డెమ్మ (ఫైల్)

నందలూరు (రాజంపేట) : మండలంలోని ఆడపూరు బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న రెడ్డెమ్మ అనే విద్యార్థిని మేడపై నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వేంపల్లి మండలం రాజుపాలెంకు చెందిన ఎం.రెడ్డెమ్మ (16)కు తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందారు. దీంతో ఆ విద్యార్థిని బంధువులు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చేర్పించారు. మనస్థాపం చెందో లేక ఏ ఇతర కారణాలో తెలియదుగానీ సోమవారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో తోటి విద్యార్థినులు వద్దన్నా వినకుండా హాస్టల్ రెండవ అంతస్తు పైనుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో 108 ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం కడప రిమ్స్‌కు తరలించారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్డీఓ రామకృష్ణారెడ్డి చేరుకొని విద్యార్థిని ఆరోగ్యంపై ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యార్థులతో విచారణ చేపట్టారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు ఈనెల 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం రావడంతో మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. గుర్తించిన వారు 9121100510కుగానీ, 9121100511లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం గౌస్ నగర్‌లో షేక్ జాఫర్‌వలీ (22) అనే యువకుడు సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తల్లి బంధువుల ఇంటికి వేంపల్లికి వెళ్లింది. అన్నదమ్ములు భోజనం చేసి బయటకు వెళ్లారు. అతను ఒక్కడే ఇంటిలో ఉన్న సమయంలో ఈ చర్యకు పాల్పడ్డాడు. సాయంత్రం గమనించిన కుటుంబీకులు జాఫర్‌వలీని ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందాడని తెలిపారు. ఎస్‌ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేశారు.

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ విజేతలు వైఎస్సార్, శ్రీకాకుళం జట్లు



బాలుర విజేత వైఎస్సార్ జట్టు



బాలికల రన్నరప్ వైఎస్సార్ జట్టు

ఒంగోలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతగా బాలుర విభాగంలో వైఎస్సార్‌జిల్లా జట్టు, బాలికల విభాగంలో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేశాయి. 67వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువుపైనా దృష్టి సారిస్తే జీవితంలో విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు ప్రకాశం జిల్లా ఆతిథ్యం బాగుందని కితాబిచ్చారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన క్రీడా దుస్తులు, ట్రోఫీలు అందించిందని, తద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో స్పష్టమైందన్నారు. సాఫ్ట్ బాల్ అంతర్‌జిల్లాల నిర్వాహక కార్యదర్శి శివశంకరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లకు భోజన సదుపాయం కల్పించేందుకు విద్యాశాఖ రూ.3 లక్షలు వెచ్చించడం అభినందనీయమంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. పీఈటీల సంఘం కార్యదర్శులు నత్తల కృష్ణ, వై.శీనయ్య, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

పోటీల విజేతలు వీరే..

బాలుర విభాగం : వైఎస్సార్(ప్రథమ స్థానం), శ్రీకాకుళం(ద్వితీయ), విజయనగరం(తృతీయ)

బాలికల విభాగం : విజయనగరం(ప్రథమస్థానం), వైఎస్సార్(ద్వితీయ స్థానం), ప్రకాశం(తృతీయ)

అండర్ 17 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లు ఇవే

అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీలకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యన్నారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

బాలుర రాష్ట్ర జట్టు : వై.లక్ష్మీ ప్రసన్న, ఎం.యశ్వంత్ (శ్రీకాకుళం), కె.ఆంజనేయులు (వైఎస్సార్ కడప), ఎస్.మధుసూదనరావు (శ్రీకాకుళం), పి.జనార్దన్‌రావు (విజయనగరం), ఎం.మనోజ్ (వైఎస్సార్ కడప), డి.రాఘవ (విజయనగరం), పి.మహీధర్ (వైఎస్సార్ కడప), బి.నారాయణస్వామి (అనంతపురం), బి.మహేష్ (పశ్చిమ గోదావరి), ఎం.ఆకాష్ (గుంటూరు), పి.యశ్వంత్(పశ్చిమగోదావరి), టి.నాగేంద్ర (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), పి.హరీష్‌సాయి (ప్రకాశం), బి.లక్ష్మణ్ స్వామి(విశాఖపట్నం), సీహెచ్ పీటర్ (ప్రకాశం), స్టాండ్‌బైలుగా ఎ.కార్తీక్ (గుంటూరు), కె.శశి (అనంతపురం), కె.హేమంత్ కుమార్ (కృష్ణా), డి.నవీన్ (వైఎస్సార్ కడప), కె.రోహిత్ (విజయనగరం).

బాలికల జట్టు : టి.ప్రశాంతి (విజయనగరం), ఎం.వీరనారాణమ్మ (వైఎస్సార్ కడప), సీహెచ్ అనిత (గుంటూరు), బి.సుప్రియ (విజయనగ రం), ఎస్.సల్మ (ప్రకాశం), ఎం.శివ నాగ లక్ష్మి (ప్రకాశం), పి.హైమావతి (విజయనగరం), ఎస్.బేబి (ప్రకాశం), జి.సునందిని(గుంటూరు), బి.నవ్యశ్రీ (కర్నూలు), కె.రాజేశ్వరి (అనంతపురం), జె.సంజన చౌదరి (ప్రకాశం), వి.యవంతిక(ప్రకాశం), కె.రిషిత (కృష్ణా), పి.రేణుక (శ్రీకాకుళం), ఎన్.భువనేశ్వరి (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలుగా టి.కీర్తన (ప్రకాశం), పి.చైతన్య కుమారి (విజయనగరం), కె.రోజా (గుంటూరు), జి.నీల (విశాఖపట్నం), టి.సుకన్య (అనంతపురం).

మరింత సుందరంగా శిల్పారామాలు



శిల్పారామాన్ని పరిశీలిస్తున్న శిల్పారామాల రాష్ట్ర సీఈఓ శ్యాం సుందర్‌రెడ్డి

కడప కల్చరల్ : రాష్ట్రంలోని శిల్పారామాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు కృషి చేస్తున్నామని శిల్పారామాల రాష్ట్ర సీఈఓ డి.శ్యాం సుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కడప శిల్పారామాన్ని పరిశీలించారు. రాష్ట్ర శిల్పారామాల పాలనాధికారి మునిరాజుతో కలిసి ఆయన అక్కడి అన్ని విభాగాలను చూసి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల శిల్పారామంలో ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించి వస్తున్న నీటిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. శిల్పారామాల అభివృద్ధిలో భాగంగా కడపలో రెండు గజిబొజిలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఒకటి ఇప్పటికే పూర్తయిందని, రెండవ దాన్ని కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. శిల్పారామం ప్రారంభంలో ఉన్న గేమ్స్ జోన్‌లోని అన్ని విభాగాలను పడమరవైపు చివరికి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతమంతా పచ్చికను ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. శిల్పారామం మొత్తం సరికొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి రాత్రి పూట ఆకర్షణీయంగా కనిపించేందుకు కృషి చేయాలన్నారు. అక్కడి స్టాల్స్‌లోని అన్నింటికీ రక్షణ కోసం సెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని మిగతా శిల్పారామాలలో కూడా అభివృద్ధి పనులు చేపట్టామని, పులివెందుల శిల్పారామాన్ని ఆధునీకరించామని, ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కడప రోడ్డులో కలెక్టరేట్ సమీపంలో శిల్పారామం ఏర్పాటుకు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో శిల్పారామాల విజయవాడ ఏఓ ఎ.శ్రీరాములు, అనంతపురం ఏఓ కృష్ణప్రసాద్, సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రొఫెసర్స్ కాలనీలో గల చౌడమ్మ ఆలయంలో 2021లో జరిగిన చోరీ కేసులో ముద్దాయిలుగా ఉన్న కమలాపురం మాధవ, దొండపాటి ప్రతాప్‌లకు సోమవారం కడప ఎక్సైజ్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా జడ్జి హేమ శ్రవంతి జానకిరామ్ వాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు 248(2) సీఆర్‌పీసీ ప్రకారం 2 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు, రూ.10వేలు జరిమానా విధించారన్నారు. అప్పటి ఎస్‌ఐ ఎన్.రాజ రాజేశ్వర్‌రెడ్డి ఈ కేసుపై దర్యాప్తు చేసి ముద్దాయిలపై నేర అభియోగ పత్రాలను కోర్టుకు అందించారు. ఈ కేసును ఛేదించి ముద్దాయిలకు శిక్ష పడేందుకు కృషి చేసిన ఎస్‌ఐలు రాజ రాజేశ్వర్ రెడ్డి, బి.అరుణ్‌రెడ్డి, బి. శ్రీనివాసులురెడ్డి, కానిస్టేబుల్ టి.మల్లికార్జునరెడ్డిలను జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అభినందించారు.

తైక్వాండో ఎంపికలు ప్రారంభం



తైక్వాండో ఎంపికలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి తైక్వాండో క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైక్వాండో క్రీడలో శిక్షణ పొందడం ద్వారా ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం కలుగుతుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. నిత్యప్రభాకర్, తైక్వాండో శిక్షకులు ఎస్.నాయబ్ రసూల్, ఎస్. జంషీర్‌బాషా, రవిశంకర్‌రాజు, విజయభాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, కె. నాగేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.